క్లుప్తంగా

వైభవంగా ప్రతిష్టా మహోత్సవం



రాజుపాలెం: మండలంలోని గణపవరం గ్రామంలో నూతనంగా నిర్మించిన పంచ పట్టాభి రామచంద్రస్వామి, రామలింగేశ్వర స్వామి, గ్రామ దేవతలు పోలేరమ్మ, పోతురాజు స్వామి వార్ల ఆలయాలను ఆదివారం వైభవంగా ప్రారంభించారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య స్వామి వార్ల విగ్రహాలను, నూతన ధ్వజ స్తంభాలను ప్రతిష్ఠించారు. అనంతరం భక్తులు ఆయా దేవతలను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

వైభవంగా నారసింహుని జయంతి



బెల్లంకొండ: మండలంలోని పులిచింతల ప్రాజెక్ట్ ముంపు గ్రామమైన కేతవరంలో కేతగిరి వజ్ర లక్ష్మీ నారసింహుని జయంతి వేడుకలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. ప్రహ్లాదుని కోరిక మేరకు నరసింహస్వామి స్తంభం నుంచి కృతయుగమున ఉద్భవించిన రోజు అని ఆలయ ప్రధాన అర్చకులు దివి చెన్నకేశవాచార్యులు తెలిపారు. కొండ దిగువన గల ఆలయంలో కేతమవర్మ యాదవరాజు స్వహస్తాలతో ప్రతిష్ట చేసిన ధ్రువబేరస్వామి వారికి ఏకాంతంగా కృష్ణానది జలాలతో అభిషేక కార్యక్రమాన్ని నిర్వహించారు. మధ్యాహ్న సమయంలో ఉభయ దేవేరులతో శాంతి కల్యాణాన్ని నిర్వహించారు. స్వామి వారికి విశేష నివేదన, నక్షత్ర హారతి, మంత్ర పుష్పం, భక్తులకు తీర్థప్రసాద వినియోగాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ ఈవో అవుదూరి వెంకటేశ్వర రెడ్డి, ట్రస్ట్ చైర్మన్ పాశం నరసింహారెడ్డి, ఈమని వెంకటరెడ్డి, అర్చకులు ప్రసన్న కుమారచార్యులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



బెల్లంకొండ: మండలంలోని వెంకటాయపాలెం, రామాంజనేయ పురం గ్రామాలలో ఆదివారం త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక పిడుగురాళ్ల చిలకలూరిపేట కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచార కార్యక్రమం నిర్వహించారు. రెండు గ్రామాలలో 101 త్రైత సిద్ధాంత ఆధ్యాత్మిక గ్రంథాల గురించి వివరించారు. ప్రతి ఇంటికి వెళ్లి భగవద్గీతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు కటికం సైదారావు, సభ్యులు యద్దనపూడి వీరాంజనేయులు, అరుణ, కార్తీక్, నారాయణమ్మ, అనురాధ, వెంకటలక్ష్మీ, శ్రీను, వీరయ్య, రాఘవ, సుందరం, రామాంజనేయులు, గంగయ్య, కోటేశ్వరమ్మ, వెంకటేశ్వర నాయక్‌లు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి భారీ స్పందన



పెదకూరపాడు: శంకర్ కంటి ఆసుపత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ, కొమరాబత్తిన రోజమ్మ, కార్యంశెట్టి జయరావు జ్ఞాపకార్థం పెదకూరపాడులోని ఆర్సీఎం పాఠశాల ఆవరణలో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరానికి భారీ స్పందన లభించింది. పెదకూరపాడు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి 700 మందికి పైగా కంటి, దంత, సాధారణ సమస్యలు ఉన్నవారు శిబిరంలో వైద్యం పొందారు. 310 మందికి కంటి శుక్లాలు శస్త్ర చికిత్స చేయాలని వైద్యులు నిర్ధారించారు. ఈ శిబిరాన్ని మాజీ క్రోసూరు మార్కెట్ యార్డు చైర్మన్ బెల్లంకొండ రామగోపాలరావు, మండల టీడీపీ అధ్యక్షుడు ఆర్తిమళ్ల రమేష్, విశ్రాంత యూనియన్ బ్యాంక్ జనరల్ మేనేజర్ కేఎల్ రాజులు ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ పారిశ్రామిక వేత్త సామినేని కోటేశ్వరరావు మాట్లాడుతూ కేఎల్ రాజు చేస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు కొమరాబత్తిన రత్తయ్య, డీఎస్పీ టీఎక్స్ అజయ్‌కుమార్, గ్రామ సర్పంచ్ గుడిపూడి రాజు, వైద్యులు చిన్నరాజు, గ్రామ పెద్దలు శాఖమూరి సీతారామయ్య, పొట్టి నాగమల్లేశ్వరరావులు పాల్గొన్నారు.

నిధులున్నా కలగానే మార్కెట్ యార్డు..!

- పట్టించుకోని అధికారులు, ప్రభుత్వం
- గత ప్రభుత్వంలో ప్రహరీ, ప్రధాన ద్వారం, గేట్లు ఏర్పాటు
- పంటలను అమ్ముకోవడానికి అవస్థలు పడుతున్న రైతులు
- చిట్టడవిని తలపిస్తున్న మార్కెట్ యార్డు స్థలం



అద్దె భవనంలో ఉన్న రాజుపాలెం వ్యవసాయ మార్కెట్ యార్డు

రాజుపాలెం: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు రైతులకు ఏమాత్రం ఉపయోగపడడం లేదు. ఏళ్ల గడుస్తున్నా పట్టించుకునే అధికారులు, ప్రజా ప్రతినిధులు కరువయ్యారు. యార్డు ఏర్పాటుకు రెవెన్యూ స్థలంను కేటాయించారు. ఈ స్థలంలో గోదాములు, కార్యాలయాలు ఏర్పాటు చేస్తే ప్రధాన పంటలైన పత్తి, మిరప, ధాన్యం, మొక్కజొన్న తదితరాలను రైతులు విక్రయించుకోవడానికి, నిల్వచేసుకోవడానికి అవకాశం ఉంటుంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నిధులు మంజూరు చేసి, పనులు ప్రారంభించారు. ప్రహరీ, ప్రధాన ద్వారం, గేట్లు ఏర్పాటు చేశారు. ఎన్నికల కోడ్ రావడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో పనులు పూర్తిగా నిలిచిపోయాయి. ప్రస్తుతం ముళ్ల కంపలు, పిచ్చి మొక్కలు మొలిచి చిన్నపాటి అడవిని తలపిస్తుంది. దీంతో మండలంలో మార్కెట్ యార్డు కలగానే మిగిలిపోయింది.

అద్దె భవనంలోనే...

గతంలో సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డు పరిధిలో రాజుపాలెం, నకరికల్లు మండలాలు కలిసి ఉన్నాయి. రెండు మండలాలకు సంబంధించిన రైతులు సత్తెనపల్లి మార్కెట్ యార్డుకు వెళ్లి పంట ఉత్పత్తులను విక్రయించుకునేవారు. సత్తెనపల్లి మార్కెట్ యార్డు దూరం కావడంతో వ్యయ ప్రయాసలతో నానా అవస్థలు పడేవారు. దీనిని గమనించిన అప్పటి ప్రజా ప్రతినిధులు, అధికారులు రాజుపాలెం, నకరికల్లు రెండు మండలాలను కలుపుతూ మార్కెట్ యార్డును 2013లో ఏర్పాటు చేశారు. తాత్కాలిక సిబ్బందిని ఏర్పాటు చేయడంతో కార్యకలాపాలు జరుగుతున్నాయి. అప్పటి నుంచి వ్యవసాయ మార్కెట్ కార్యాలయం అద్దె భవనంలోనే కొనసాగుతుంది. 12 ఏళ్లు కావస్తున్నా ప్రభుత్వం కార్యాలయాలు ఏర్పాటు చేయాలని అధికారులు ఆలోచన చేయడం లేదు.

గత ప్రభుత్వంలో నిధులు మంజూరు

రాజుపాలెం జిల్లా పరిషత్ పాఠశాల పక్కన యార్డుకు 3.45 ఎకరాలు కేటాయించిన స్థలంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పరిపాలన కార్యాలయం, ఇన్నర్ రోడ్లు, మరుగుదొడ్లు నూతనంగా నిర్మించేందుకు రూ.1.33 కోట్లు మంజూరు చేశారు. ప్రహరీ నిర్మించేందుకు రూ.40 లక్షలు మంజూరు చేయడంతో చుట్టూ ప్రహరీ నిర్మించి రెండు ప్రధాన ద్వారాలను ఏర్పాటు చేసి గేట్లు కూడా బిగించారు. యార్డుకు సంబంధించి కొండమోడు, నకరికల్లులో రెండు చెక్ పోస్టులను ఏర్పాటు చేశారు. ఈ చెక్ పోస్టుల ద్వారా ఏడాదికి సుమారు రూ.కోటి ఆదాయం వస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మంజూరు చేసిన నిధులు ఉన్నా ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదు. మార్కెట్ యార్డు స్థలంలో కంప చెట్లు మొలిచి చిట్టడవిని తలపిస్తుంది. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం, అధికారులు స్పందించి యార్డు నిర్మాణం చేపట్టి అందుబాటులోకి తేవాలని రైతులు కోరుతున్నారు.



అడవిని తలపిస్తున్న రాజుపాలెం వ్యవసాయ మార్కెట్ యార్డు స్థలం



యార్డు స్థలానికి ఏర్పాటు చేసిన ప్రధాన గేటు, ప్రహరీ

వినియోగంలోకి తేవాలి



రాజుపాలెం వ్యవసాయ మార్కెట్ యార్డు వలన ఉపయోగం లేదు. ఏళ్లు గడుస్తున్నా పట్టించుకునే అధికారులే లేరు. గోదాములు, కార్యాలయం ఏర్పాటు చేయాలి. రైతులకు ఉపయోగపడే విధంగా చర్యలు చేపట్టాలి. రైతులు పంటలను అమ్ముకోవడానికి యార్డు ఉపయోగపడడం లేదు. అధికారులు స్పందించి వినియోగంలోకి తేవాలి.

–బొద్దుపల్లి హనుమంతరావు, రాజుపాలెం

ప్రజాధనం దుర్వినియోగం



రాజుపాలెం వ్యవసాయ మార్కెట్ యార్డు వలన ప్రజాధనం దుర్వినియోగం తప్ప రైతులకు ఉపయోగపడడం లేదు. ప్రధాన పంటలైన పత్తి, మిరప, ధాన్యం, మొక్కజొన్న తదితర పంటలు అమ్ముకోవడానికి యార్డును ఉపయోగంలోకి తీసుకు రావాలి. రైతుల సొమ్మును, ప్రజాధనాన్ని ప్రజా ప్రతినిధులు, అధికారులు విచ్చలవిడిగా ఖర్చు చేస్తున్నారే తప్ప రైతులకు ఒరిగింది లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి యార్డును రైతులకు ఉపయోగపడే విధంగా చర్యలు తీసుకోవాలి.

– వేల్పుల లక్ష్మయ్య, ఉప్పలపాడు

డబ్బులు వెంటనే చెల్లిస్తాం

రాజుపాలెం వ్యవసాయ మార్కెట్ యార్డుకు కార్యాలయాలు, ఇన్నర్ రోడ్లు, మరుగుదొడ్లు ఏర్పాటు చేసేందుకు రూ.1.33 కోట్లు మంజూరై ఉన్నాయి. ప్రభుత్వం, ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ టెండర్లకు పిలిచి పాడుకున్న కాంట్రాక్టు పనులు ప్రారంభించి కట్టినట్లయితే వెంటనే డబ్బులు చెల్లిస్తాం.

– పొనుగుపాటి మురళీధర్, కార్యదర్శి, వ్యవసాయ మార్కెట్ యార్డు

నేడు వేంకటేశ్వరునికి గరుడ వాహన సేవ

సత్తెనపల్లి: పట్టణ రైల్వేస్టేషన్‌రోడ్‌లోని అలివేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఈ నెల 12న వైశాఖమాస 42వ పౌర్ణమి గరుడ వాహన సేవ జరుగుతుందని శ్రీవారి సేవా సమాజం ఆలయ ధర్మకర్తలు ఆదివారం తెలిపారు. సోమవారం ఉదయం శ్రీవారికి స్నపన తిరుమంజనం, పరిమళ మల్లెలతో పుష్పాభిషేకం, మహాలక్ష్మీ అమ్మవారికి కస్తూరి కుంకుమ, పరిమళ మల్లెలతో విశేష పూజ జరుగుతుందన్నారు. రాత్రి 7.30 గంటలకు గరుడ వాహన సేవ అనంతరం ప్రసాద వితరణ జరుగుతుందన్నారు. భక్తులు సంప్రదాయ దుస్తులతో శ్రీవారి గరుడ వాహన సేవకు హాజరై పరిపూర్ణ అనుగ్రహం పొందాలన్నారు.

పోలేరమ్మకు మొక్కులు తీర్చుకున్న భక్తులు

గోళ్ళపాడు(ముప్పాళ్ళ): మండలంలోని గోళ్ళపాడు గ్రామంలో పోలేరమ్మతల్లి వార్షిక తిరునాళ్లలో భాగంగా ఆదివారం భక్తులు అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామ దేవతకు జలాభిషేకం నిర్వహించారు. అనంతరం పొంగళ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో భాగంగా అమ్మవారికి కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

ఘనంగా మాతృ దినోత్సవం



పెదకూరపాడు: భూమి మీద తల్లికి మించిన దైవం లేదని మాజీ ఎంపీటీసీ షేక్ ముంతాజ్, మాగులూరి ఫౌండేషన్ సభ్యులు కల్పన అన్నారు. పెదకూరపాడులోని సాయిబాబా దేవాలయం వద్ద మాగులూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా మాతృ దినోత్సవం నిర్వహించారు. పిల్లలు తల్లుల చేత కేక్ కట్ చేయించి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి బిడ్డ ఎదుగుదలకు తల్లుల కృషి ఎంతో ఉంటుందన్నారు. తల్లి ప్రేమను వెలకట్టలేమన్నారు. ఈ కార్యక్రమంలో మాగులూరి ఫౌండేషన్ నిర్వాహకులు కృష్ణారావు, కుంచనపల్లి కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

‘షేర్ ద విజన్’ సేవలు అభినందనీయం

మండల విద్యాశాఖాధికారి–1 శ్రీనివాసరావు



సాధన అనాథ వృద్ధాశ్రమానికి నిత్యావసరాలు అందించిన షేర్ ద విజన్ సంస్థ బాధ్యులు, ఎంఈవో శ్రీనివాసరావు

సత్తెనపల్లి: తెలంగాణ రాష్ట్రం ఖమ్మం ఏరియాకు చెందిన షేర్ ద విజన్ స్వచ్ఛంద సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమని సత్తెనపల్లి మండల విద్యాశాఖాధికారి–1 ఎ.శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని సాధన అనాథ వృద్ధాశ్రమానికి షేర్ ద విజన్ సంస్థ మూడు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు, మంచాలు, బెడ్లు, కూలర్, మిక్సీ, సీలింగ్ ఫ్యాన్‌లు, టేబుల్ ఫ్యాన్‌లు, గీజర్, దుస్తులు, దుప్పట్లు ఆదివారం అందించింది. ఈ కార్యక్రమానికి ఎంఈవో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ షేర్ ద విజన్ స్వచ్ఛంద సంస్థ ఎంతో ఉదారంగా చేస్తున్న సేవలను సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. ఈ సంస్థ భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. షేర్ ద విజన్ సంస్థ ప్రెసిడెంట్ నారాయణ మాట్లాడుతూ తాము సేవా కార్యక్రమాలను కరోనాకు ముందు నుంచి చేస్తున్నామన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో అనేక అనాథ ఆశ్రమాలకు కావలసిన సామగ్రిని అందజేస్తున్నామన్నారు. భవిష్యత్తులో కూడా అనాథాశ్రమాలకు మరింత అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా సంస్థ ప్రెసిడెంట్ నారాయణ, ఎంఈవో–1 ఎ.శ్రీనివాసరావులను సాధన అనాథ వృద్ధాశ్రమ అధినేత బక్కా సురేష్‌బాబు సన్మానించారు. కార్యక్రమంలో షేర్ ద విజన్ సంస్థ సభ్యులు, సాధన అనాథ వృద్ధాశ్రమ వాసులు, పాల్గొన్నారు.

యాసారపు బాబుకు సేవా భూషణ్ అవార్డు



సేవా భూషణ్ అవార్డు అందుకుంటున్న యాసారపు బాబు



సేవా భూషణ్ అవార్డు అందుకుంటున్న గార్లపాటి దాసు

సత్తెనపల్లి: తెలుగు కళా రత్నాలు సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడలోని కొత్తా పరిపూర్ణానంద కళావేదికలో సత్తెనపల్లికి చెందిన ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మాజీ సభ్యుడు యాసారపు బాబుకు సేవా భూషణ్ అవార్డును రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ మురళీకృష్ణ చేతుల మీదుగా ప్రదానం చేశారు. పల్నాడు జిల్లాలో గత కొన్ని సంవత్సరాలుగా దళిత గిరిజన వర్గాలకు బాబు చేసిన సేవలను గుర్తించి ఆ వర్గాలను చైతన్య పరచడంలో కీలక పాత్ర పోషించినందుకు గాను బాబుకు అవార్డును అందించడం జరిగిందని జాతీయ తెలుగు కళా రత్నాలు సేవా సంస్థ సీఈవో డాక్టర్ యు.వి.రత్నం ప్రకటించారు. ఈ సందర్భంగా బాబును జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మాజీ సభ్యుడు గార్లపాటి దాసు, బంక శ్రీనివాసరావు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సత్తెనపల్లి డివిజన్ సభ్యుడు వేల్పుల అఖిల్, గురజాల డివిజన్ సభ్యుడు రాయినూతల సురేష్, దళిత నాయకురాలు సన్నెపాగ ప్రశాంతి, జిల్లాలోని పలువురు ప్రముఖులు అభినందించారు.

గార్లపాటి దాసుకు సేవాభూషణ్ అవార్డు

క్రోసూరు: క్రోసూరు గ్రామానికి చెందిన ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ మండలి రాష్ట్ర హానరబుల్ చైర్మన్ గార్లపాటి దాసుకు సేవా భూషణ్ అవార్డు లభించింది. విజయవాడలో ఆదివారం తెలుగు కళారత్నాలు సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో రిటైర్డు అడిషనల్ ఎస్పీ మురళీకృష్ణ చేతుల మీదుగా అవార్డు అందుకున్నట్లు ఈ సందర్భంగా దాసు తెలిపారు. దాసుకు అవార్డు రావటం పట్ల పలువురు దళిత నాయకులు, చర్మకార సంఘం ప్రతినిధులు అభినందనలు తెలియజేశారు.

అమరవీరుడు మురళీనాయక్ త్యాగాన్ని దేశం మరువదు

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి



మురళీనాయక్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సుధీర్ భార్గవ్‌రెడ్డి తదితరులు

సత్తెనపల్లి: యుద్ధంలో అమరుడైన అగ్నివీర్ మురళీనాయక్ త్యాగాన్ని యావత్తు దేశం మరువదని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి అన్నారు. వీర జవాన్ మురళీనాయక్ మృతి చెందడంతో పట్టణంలోని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాలయంలో ఆదివారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డాక్టర్ గజ్జల మాట్లాడుతూ యుద్ధంలో ధైర్యంగా పోరాడి వీరమరణం పొందిన మురళీనాయక్ మృతి యావత్ దేశాన్ని దుఃఖ సాగరంలో ముంచిందన్నారు. ఆయన పోరాట స్ఫూర్తి ఆదర్శనీయమన్నారు. మురళీనాయక్ యువతరానికి ఆదర్శమన్నారు. దేశం కోసం ఆయన వీరమరణం పొందారని, ఆయన ఆత్మకు శాంతి కలగాలని కోరుకున్నారు. ఏకైక బిడ్డను కోల్పోయిన మురళీనాయక్ తల్లిదండ్రుల ఆవేదన తీర్చలేనిదని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆ కుటుంబానికి అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చల్లంచర్ల సాంబశివరావు, షేక్ నాగూర్ మీరాన్, రమావత్ కోటేశ్వరరావు నాయక్, షేక్ మౌలాలి, కళ్ళం విజయభాస్కర్ రెడ్డి, చిలుకా జైపాల్, రాజవరపు శివ నాగేశ్వరరావు, అచ్యుత శివ ప్రసాద్, విప్పర్ల కొండలు, గుజ్జర్లపూడి కృపాదానం, షేక్ నాగూర్ బాషా, బండి మల్లికార్జునరెడ్డి, లోకా మాధవ, ఇంటూరి వీరయ్య, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ముగిసిన ఏసుక్రీస్తు జూబ్లీ ప్రత్యేక స్వస్థత ప్రార్థనలు

సత్తెనపల్లి: మానవాళిని సన్మార్గంలో నడిపించడానికి ఏసుక్రీస్తు లోకానికి వచ్చాడని లోక రక్షకుడు ఏసు అని వక్తలు పేర్కొన్నారు. పట్టణంలోని హోలీ ఫ్యామిలీ పాఠశాల ఆవరణలో జరుగుతున్న ఏసుక్రీస్తు జూబ్లీ–2025 ప్రత్యేక స్వస్థత ప్రార్థనలు ఆదివారంతో ముగిశాయి. విశాఖ డివైన్ మెర్సీ ధ్యాన ఆశ్రమం డైరెక్టర్ రెవ.ఫాదర్ జుజ్జువరపు మరియదాస్ వాక్యోపదేశం చేశారు. మధ్యాహ్నం పాప సంకీర్తనలు ఆలపించారు. ఈ సందర్భంగా జుజ్జువరపు మరియదాస్ ప్రత్యేక స్వస్థత ఆరాధన చేపట్టారు. అనంతరం జూబ్లీ వేదిక నుంచి ప్రదర్శన ప్రారంభమై పట్టణంలోని గడియార స్తంభం వరకు కొనసాగి తిరిగి జూబ్లీ వేదిక వద్దకు చేరుకుంది. అనంతరం సమిష్టి దివ్యబలి పూజ నిర్వహించారు. మహాఘన పీఠాధిపతులకు ఘన సన్మానం సత్తెనపల్లి డీసరీ గురువులు, డీసరీ సిస్టర్లు నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ప్రేమ, క్షమ క్రీస్తు సందేశం అని, అలాంటి క్రీస్తు బోధనలతో మానవుడు సన్మార్గంలో నడవాలన్నారు. ప్రతి ఒక్కరూ ఏసు బోధించిన శాంతి మార్గంలో నడవాలన్నారు. పాస్టర్లు, విశ్వాసులు తదితరులు పాల్గొన్నారు.

మండుతున్న ఎండుగడ్డి

కొనలేకపోతున్న పశుపోషకులు



క్రోసూరు: ఈ ఏడాది వరిగడ్డి కూడా మండిపోతుంది. పశు పోషకులు వరిగడ్డి కొనలేని పరిస్థితి నెలకొంది. సాధారణంగా గతంలో వరి సాగు ముమ్మరంగా ఉండేది. ఖరీఫ్, రబీలో కాలువల కింద, చెరువుల కింద మాగాణి భూముల్లో వరి సాగు జరిగేది. రానురాను ఏటా కాలువ నీళ్లు సక్రమంగా రాకపోవటం, వారాబందీ అంటూ చివరి భూములకు నీళ్లు రాకపోవటంతో రైతన్నలు విసిగిపోయి అధిక శాతం వరి సాగును వదిలేసారు. అంతేకాక పెట్టుబడులు, కూలీ ఖర్చులు పెరిగిపోవటమే గానీ గిట్టుబాటు కావటం లేదని రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది రబీలో మండలంలో 610 ఎకరాల్లో వరి సాగు చేశారు. అది కూడా దొడ్లేరు, ఆవులవారిపాలెం, పెరికపాడు గ్రామాల్లో మాత్రమే సాగు జరిగింది. సొంతంగా పశువులున్న వారు మినహా మిగత వారు మాత్రమే గడ్డి అమ్ముకుంటారు. వారిలో అధిక శాతం యంత్రాలతో వరి కోతలు చేసినవే, కొంత మంది మాత్రమే కూలీలతో వరి కోతలు నిర్వహించారు. దీంతో మండలంలో పశు పోషకులకు వరిగడ్డి దూర ప్రాంతాల నుంచి ట్రాక్టర్లపై తెచ్చి విక్రయిస్తున్నారు. ఎకరా గడ్డి ట్రాక్టర్‌పై 80 చుట్టలు తెచ్చి, చుట్ట రూ.100 చొప్పున ఎకరా గడ్డి రూ.8,000కు విక్రయిస్తున్నారు. అదే కూలీల చేత కోయించిన గడ్డి ఎకరా రూ.12 వేలు వరకు విక్రయిస్తున్నారని పశు పోషకులు చెబుతున్నారు. పశు పోషణ భారంగా మారిందని పలువురు పశు పోషకులు అంటున్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీ కొన్న లారీ

తప్పిన పెను ప్రమాదం



నెర్రలు వచ్చిన విద్యుత్ స్తంభం

పెదకూరపాడు: విద్యుత్ స్తంభాన్ని సిమెంట్ లోడుతో ఉన్న లారీ ఢీ కొన్న ఘటన ఆదివారం పెదకూరపాడు బస్టాండ్ వద్ద చోటు చేసుకుంది. విద్యుత్ ఏఈ రామకృష్ణ, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదకూరపాడు బస్టాండ్ వద్ద ఏపీ07టీఏ1313 నెంబరు కలిగిన సిమెంట్ లారీ రివర్స్ చేస్తున్న క్రమంలో 75త్యాళ్ళూరు విద్యుత్ సబ్‌స్టేషన్‌కు 33 కేవీ ఫీడర్ సప్లయి వెళ్లే స్తంభాన్ని బలంగా ఢీ కొంది. స్తంభం కింద భాగం దెబ్బతింది. నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో ఒక్కసారిగా ప్రమాదం జరగడంతో ప్రయాణికులు, స్థానికులు పరుగులు పెట్టారు. ఈ ఘటనపై ఏఈ రామకృష్ణ పెదకూరపాడు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

నేడు లక్ష్మీనరసింహస్వామి తిరునాళ్ల



నకరికల్లులోని కొండపై గల శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం ఏరియల్ వ్యూ



శ్రీలక్ష్మీనరసింహస్వామి వారు

నకరికల్లు: విశాలమైన చెరువు పక్కన ఎత్తయిన కొండపై ఆహ్లాదకరమైన ప్రకృతి నడుమ కొలువు దీరి ఉన్న శ్రీ ఆదిలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి వార్షిక తిరునాళ్ల మహోత్సవం సోమవారం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. మహిమాన్విత స్వామిగా ప్రసిద్ధికెక్కిన శ్రీలక్ష్మీనరసింహస్వామి తిరునాళ్లను గ్రామస్తులతో పాటు సమీప గ్రామాల ప్రజలు వేడుకలా జరుపుకుంటారు. స్వామి వారి కల్యాణ వేడుక మంగళవారం తెల్లవారుజామున అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. అర్చకులు కొడవటికంటి మధుసూధనాచార్యులు ఆధ్వర్యంలో విశేష పూజలు ప్రారంభించారు. ఆదివారం స్వామి వారికి విశేష ద్రవ్యములతో అభిషేకాలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. తిరునాళ్లకు తరలి వచ్చే భక్తులకు అన్నదానం చేసేందుకు కొండకింది భాగంలో ఏర్పాట్లు సిద్ధం చేశారు. కొండ వరకు నడవలేని భక్తుల కోసం భక్త సంఘం తరపున ప్రైవేటు వాహనాలను ఏర్పాటు చేశారు. భక్త సంఘం ఆధ్వర్యంలో విద్యుత్ ప్రభలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ వారు మాట్లాడుతూ వేడుకలకు తరలివచ్చే భక్తులందరికీ అన్నప్రసాద ఏర్పాట్లు చేశామని ప్రతి ఒక్కరూ స్వీకరించాలని కోరారు.

నూతలపాటి హనుమయ్యకు వైవీ సుబ్బారెడ్డి పరామర్శ



నూతలపాటి హనుమయ్య మాతృమూర్తి సీతారావమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైవీ సుబ్బారెడ్డి

అమరావతి: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి నూతలపాటి హనుమయ్య మాతృమూర్తి సీతారావమ్మ ఇటీవల మరణించారు. ఈ క్రమంలో రాజ్యసభ సభ్యుడు వై.వి.సుబ్బారెడ్డి ఆదివారం నూతలపాటి హనుమయ్య స్వగ్రామం నూతల పాటివారిపాలెంలో ఆయనను పరామర్శించారు. తొలుత నూతలపాటి సీతారావమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నూతలపాటి హనుమయ్య కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, పంచాయతీరాజ్ విభాగం జిల్లా కార్యదర్శి అలా లక్ష్మీనారాయణ, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బిహెచ్ హనుమంతరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంపా జ్వాలా లక్ష్మీనరసింహరావు, కె.హరిబాబు, ఎం.కోటేశ్వరరావు, పెద అంజిరెడ్డి, ఎ.శ్రీనివాసరెడ్డి, కె.కోటేశ్వరరావు, వెంపా వాసు, ఎం.హరిబాబు, పుల్లారెడ్డి, శివనాగిరెడ్డి, షరీఫ్, పాపారావు, నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

ప్రతిష్టకు సిద్ధమవుతున్న గంగా పార్వతి సమేత విశ్వేశ్వరాలయం



ఉయ్యందన(క్రోసూరు): మండలంలోని ఉయ్యందన గ్రామంలో సుమారు రూ.3 కోట్లతో గంగా పార్వతి సమేత విశ్వేశ్వరసామి దేవాలయ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ నెల 22న పలు దేవతామూర్తుల విగ్రహాల ప్రతిష్టకు యాగశాల సిద్ధం చేస్తున్నారు. 22న విగ్రహ ప్రతిష్టా మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఏర్పాట్లు చేస్తుంది. ఉయ్యందన గ్రామంలో అతిపెద్ద అభయాంజనేయస్వామి విగ్రహం పక్కనే శివాలయం ఉండటం భక్తులకు మరింత సంతోషాన్ని ఇస్తుంది.